
# తానొకటి తలిస్తే

కృష్ణప్రియ



**మనిషికి వుండే కోర్కెలు రెండు రకాలు. అందులో మొదటి రకం ప్రకృతి సహజంగా వుంటే, రెండవ రకం మనిషి తనకంటూ తను నిర్దేశించుకుని తన మనసుని తదనుగుణంగా నడవమని ఆదేశించేవి. మొదటి రకం కోర్కెలు ఎలాగూ ప్రకృతి సహజంగానే తీరతాయి. ఎటొచ్చీ బాధంతా రెండో రకంలోనే.**

"తానొకటి తలిస్తే దైవమొకటి తలచింది" అన్న సామెత రెండోరకం కోర్కెల్ని కంట్రోల్ చేస్తుంది. ఉదాహరణకి నేమన్నాను— బాగానే చదువుకున్నాను. బ్యాంకి ఆఫీసరు హోదాలో నాలుగంకెల జీతాన్ని అందుకుంటున్నాను.

అందంగా వుంటానని చూచినవాళ్ళు అంటుంటారు. ఆస్తులు లేవు తల్లి తప్ప బాదర బందీలు లేవు. అలాంటి నాకు "నా పెళ్ళి" ఒక సమస్య అయి కూర్చుంది. ఇదేమిటే, తెలుగు దేశంలో అబ్బాయికి పెళ్ళి కావడం సమస్య అవడం ఏమిటే అని విన్నవాళ్ళు బుగ్గలు నొక్కుకుంటారు. దానికి కారణం నా కోరికలు.

నా కోరికల లిస్టులో భార్య అందానికి ప్రాధాన్యత లేదు. ఐశ్వర్యానికి అంతకన్నా లేదు. ఇక చదువంటారా— ఈ రోజుల్లో ప్రతీ ఆడపిల్లా గ్రాడ్యుయేట్ అయ్యే వుంటోంది. అక్కడే వచ్చింది చిక్కంతా. నాకు కావలసిన అమ్మాయి సగటు భార్యలా వుండాలి. అంతేకాని ఉద్యోగస్థురాలు అయితే నాకు అభ్యంతరం.

ఎందుకంటారా— ఈ రోజుల్లో చూస్తున్నా కదా— జీవితం పూర్తిగా యాంత్రికంగా తయారవుతోంది. ఉద్యోగస్థురాల్ని చేసుకుంటే ఇహ చెప్పక్కర లేదు. నా భార్య నా అవసరాల్ని తీరుస్తూ, నా పిల్లలకు బాధ్యతాయుతంగా పూర్తి ప్రేమని పంచుతూ, నా జీవిత నౌకని సాఫీగా నడపాలని నా ఆశయం. ఇది ఎంతమాత్రం పురుషాధికారం చూపించడం కాదు సుమండీ.

ఇంతవరకూ అలాంటి అమ్మాయి దొరకలేదా అంటే ఖర్మకాలి ఇప్పటిదాకా మా అమ్మకి నచ్చిన ప్రతీ అమ్మాయి ఉద్యోగస్థురాలే. మంచి ఉద్యోగం చేసుకుంటున్న వాళ్ళే. ఎందుకో వాళ్ళతో ఉద్యోగ విషయమై గట్టిగా మాట్లాడలేక పోయాను ఇంతవరకూ. ఏమైనా, ఇహ రంగప్రవేశం చెయ్యాలి అనుకుంటున్నాను.

* * * * *

మేముంటున్న ఇల్లు మూడు పోర్షనులది. మధ్యలో ఇంటివారుంటున్నారు. ఒక వైపు మేము. వేరొకవైపు పోర్షను ఈ మధ్యనే ఖాళీ అయింది. అద్దె పాతిక రూపాయిలు పెంచి "టు లెట్" బోర్డు పెట్టుకు కూర్చున్నాడు మా ఇల్లుగలాయన.

ఆ రోజు రాత్రి భోజనం వడ్డిస్తూ అన్నది అమ్మ "చివరి పోర్షనుకు ఎవరో అడ్వాన్సు ఇచ్చారట్రా" అని. రెండురోజుల తర్వాత మూడో పోర్షను కూడా కల కలలాడడం మొదలైంది.

గవర్నమెంట్ పుణ్యమా అని రిటైర్ అయిన ఒక బడిపంతులు, వారి అమ్మాయి ఆ ఇంట్లో దిగారు. ఆ అమ్మాయి స్టేట్‌బ్యాంక్‌లో క్లర్క్‌గా చేస్తోందట.

రోజూ మేమిద్దరం ఆఫీసులకి బయల్దేరే సమయం ఒకటే అవడంతో ఆవిణ్ణి పరీక్షగా చూసే అవకాశం ఏర్పడింది నాకు. సాధారణంగా నాకు ఆడపిల్లల్ని పరీక్షగా చూసే అలవాటు తక్కువ. అంటే అంత బుద్ధావతారాన్ని అని కాదు. చొరవ తక్కువ.

ఎంతో నీట్‌గా, చామన చాయగా, కళ కళలాడే ముఖంతో నిండుగా వుండే ఆ అమ్మాయి అంటే నాకు గొప్ప అభిమానం. ఆవిడ పేరు స్వర్ణట. అప్పుడే అమ్మకీ, ఆవిడకీ స్నేహం కుదిరినట్లుంది. ఆ అమ్మాయిని అమ్మ ఇంట్లో ఒకటే పొగిడేది నా దగ్గర. వాళ్ళ నాన్నగారితో నేను అప్పుడప్పుడూ బాతాఖానీ వేసేవాణ్ణి.

అపుడే అమ్మ రంగంలోకి దిగింది. ఒకరోజన నన్ను కదిపింది.

"ఏరా అబ్బాయ్, ఇప్పటిదాకా ఏవో వంకలుచెప్తూ వచ్చావ్, స్వర్ణని చూశావ్

కదరా. మంచిపిల్ల. ఇహనైనా నాకు నీ బాధ్యతల నుంచి రిటైర్‌మెంట్ ఇప్పించరా'' అని.

ఏం చెప్పాలో తెలియక ''నాకొక నాలుగు నెలలు టైమ్ కావాలమ్మా, ఆ తర్వాత నీ ఇష్టం'' అన్చెప్పి తప్పించుకున్నాను ప్రస్తుతానికి.

* * * * *

ఆ రోజు బ్యాంకుకి వెళ్ళేటప్పటికి అందరూ చెప్పుకొంటున్న విషయం నా చెవి దాకా వచ్చింది ఏమిటంటే— మా సెక్షన్‌లోనే పనిచేస్తున్న నీరజ అనే క్లర్క్‌కి అయిదు సంవత్సరాల బాబు వున్నాడు. వాడు నిన్న సాయంత్రం కాన్వెంట్ నుండి ఇంటికి రావడానికి ఇంకా రిక్షా రాకపోవడంతో రోడ్ క్రాస్ చేస్తూ జరిగిన యాక్సిడెంట్‌లో కాలు విరిగిన వైనం. నీరజ భర్త ఇంజనీరు. నిజం చెప్పాలంటే ఆవిడకి ఉద్యోగం చెయ్యవలసిన అవసరం ఏ మాత్రం లేదు. కాకపోతే ఏదో బ్యాంక్ ఉద్యోగం వచ్చింది కదా అనీ, చెయ్యకపోవడం ఎందుకు అనే క్రేజ్ కొద్దీ తప్ప. వాళ్ళకి ఒక్కడే బాబు. అతని సంరక్షణకు ఎవ్వరూ లేకపోయేటప్పటికి ఇలా జరిగిందేమో అన్పించింది నాకు. అదే, పిల్లల్ని ఏ రిక్షా వాళ్ళ మీదో వదలకుండా సాయంత్రం అయేటప్పటికి తల్లి వెళ్ళి తెచ్చుకుంటే ఆ పిల్లలకు ఎంత సంతోషంగా వుంటుంది! ఇలా ఉద్యోగస్థుల పిల్లలు మానసికంగా, శారీరకంగా కూడా సెక్యూరిటీ కోల్పోతున్నారేమో ఈ కాలంలో అన్పిస్తుంది నాకు.

అదే ఉద్యోగం ఏ ఆధారమూ లేని ఒక నిరుద్యోగికి వస్తే ఒక కుటుంబం నిలుస్తుంది కదా! తను ఉద్యోగం చెయ్యకపోతే జరగని పరిస్థితి ఆమెది ఎంత మాత్రమూ కాదు. తన జీతంలో సగం సిటీబస్సులకీ, పని మనుషులకీ, లాండ్రీలకీ, పిల్లల రిక్షాలకీ తగలెడ్తూ మిగతా సగం క్రొత్త క్రొత్త చీరలు, హోటళ్ళు, పిక్‌నిక్‌లు, సినిమాలకి పొయ్యడమే కదా అనిపించింది. అదే ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ హాయిగా ఉన్నంతలో పొదుపుగా సంసారాన్ని లాగిస్తే ఎంతో ఆనందం అన్పిస్తుంది. ''హా, భారతనారీ, నీకు నీవే సాటి'' అనుకున్నాను.

* * * * *

ఆ రోజు అపుడే వచ్చిన పోస్టు చూసుకుంటున్నాను. ఇంతలో నాకొక పర్సనల్ లెటర్. ముందర అఫీషియల్ లెటర్స్ అన్నీ చూద్దామని నా లెటర్ ప్రక్కనే పడేసాను.

మధ్యాహ్నం లంచ్ అవర్లో తీరికగా లెటర్ విప్పాను. కొత్త హాండ్ రైటింగ్.

పూజ్యులైన రావ్‌గారికి,

నమస్కారములు. ఈ మధ్యనే మీ అమ్మగారు మీ, నా పెళ్ళి విషయం నా దగ్గర కదిపారు. మీరు కొంత టైమ్ కావాలన్నార్ట. ఈలోపల నా సమస్యలు మీకు చెప్దామని చెప్పలేక ఈ లెటర్ వ్రాస్తున్నాను. నా చొరవకు వేరుగా భావించకండి.

మాది మధ్యతరగతి కుటుంబం. నాన్నగారు రిటైర్ అయి పింఛను పుచ్చుకుంటున్నారు. ఆయనకి ప్రస్తుతం నా పెళ్ళి ఒక సమస్య. ఈ రోజుల్లో ప్రతీ పెళ్ళి కొడుక్కీ అమ్మాయి కనీసం గ్రాడ్యుయేట్ అయివుండాలి. అందుకు ఉద్యోగం వుంటే కట్నంలో కొంత డిస్కౌంట్ లభిస్తుంది. కాస్తో, కూస్తో కట్నం ఇచ్చే పరిస్థితులలోనే వున్నారు నాన్నగారు.

కానీ, నాకు పెళ్ళి అయిన తర్వాత ఉద్యోగం చెయ్యడం ఇష్టంలేదు అనే కంటే ఆ పని చాలా కష్టతరం అనిపిస్తుంది. నా జీతం డబ్బుల అవసరం మీకు లేనప్పుడు అనవసరమైన ఆడంబరాలకు పోయి మనశ్శాంతిని దూరం చేసుకోలేను. నేను, నా భర్త, పిల్లలు ఆరోగ్యకరమైన వాతావరణంలో నా సంసారం ప్రశాంతంగా సాగాలి. అందుకు అంగీకరించిన సంబంధం వచ్చినపుడే వివాహం చేసుకుందామని నా ఆశయం.

సహృదయంతో అర్థం చేసుకునే మీలాటి యువకుల చేయూత ఈనాటి నాలాటి ఆడపిల్లలకి కావాలి. ఎందుకో మిమ్మల్ని చూస్తే నా సమస్యని అర్థం చేసుకోగలరనిపించింది. ఈ విషయంలో మీ అంగీకారమైతే వివాహానికి అభ్యంతరం లేదని తెలియచేస్తూ —

—స్వర్ణ

ఆ లెటర్ చదివి ఖ్రమాన్పడిపోయాను. ''తానొకటి తలిస్తే దైవం కూడా అదే తలచిందా'' అనుకుంటూ నేనూ, స్వర్ణ, మా హేపీహోమ్‌ని ఒక్క క్షణం ఊహించుకుని, హుషారుగా ఆఫీస్ ఫైల్స్‌లో తల దూర్చాను. *